
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తమిళనాడు

TAMILNADU

మంగళవారం 23 జనవరి 2024

చెన్నైలో అయోధ్య సంబరాలు

ప్యారీస్, జనవరి 22: అయోధ్య రామాలయంలో సోమవారం బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కోలాహలంగా నిర్వహించిన నేపథ్యంలో, రాజధాని నగరం చెన్నై, శివారు ప్రాంతాల్లోని రామాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వామివార్లకు ప్రత్యేక అలంకరణ, హారతి, పూజలు నిర్వహించారు. నీలమేఘశ్యాముడి జీవిత చరిత్ర ఘట్టాలపై ప్రసంగాలు, రాముడి చిత్రపటంతో ఊరేగింపులు, భజన, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నప్రసాదాలతో ఆలయాల్లో సందడి నెలకొంది.

టీటీడీ ఆలయంలో...

టి.నగర్ వెంకటనారాయణ రోడ్డులో ఉన్న టీటీడీ ఆలయంలో ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు విష్ణు సహస్రనామ పారాయణంతో ప్రత్యేక పూజలు ప్రారంభించారు. రామజన్మభూమి క్షేత్ర ప్రాణ ప్రతిష్ఠ వేడుకలను పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో ఇటీవల ఆవిష్కరించిన భారీ శ్రీరాముడి విగ్రహానికి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు యు.విఘ్నేశ్వర్, సుబ్రమజియన్‌ల నేతృత్వంలో మాండలిన్ కచ్చేరి, సాయంత్రం 4 గంటలకు కలైమామణి జయలక్ష్మి శేఖర్ వీణానాదం, 5 గంటలకు శ్రీ తారకరామ మంత్ర జపం, 5.15 నుంచి 7.30 వరకు ఢిల్లీకి చెందిన మాధవి వైష్ణవి బృందం, సంగీ కళానిధి పద్మభూషణ్ డాక్టర్ సుధా రఘునాథన్ భక్తి గీతాల సంగీత కార్యక్రమం వీనులవిందుగా సాగింది.



టీటీడీ ఆలయ ప్రాంగణంలో భారీ రాముడి విగ్రహానికి హారతి పూజ

రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు

అడయార్, జనవరి 22: అయోధ్య రామాలయంలో రామ్ లల్లా ప్రాణప్రతిష్ఠ ఘట్టాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే, ప్రజలు కూడా తమ గృహాల ముంగిట రంగురంగుల రంగవల్లికలతో అలంకరించి భక్తిశ్రద్ధలతో ఈ పూజాల్లో పాల్గొన్నారు. అయితే, ఆలయాల్లో ఎలాంటి పూజలు, ప్రసాదాల వితరణ చేయొద్దంటూ రాష్ట్రప్రభుత్వం మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్టుగా ప్రచారం జరిగింది. ఈ ప్రచారం తప్పని నిరూపిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రైవేటు, పబ్లిక్ ప్రాంతాలు, ఆలయాలు, కల్యాణ మండపాలు, పార్కుల్లో ప్రత్యక్ష ప్రసారం చేశారు. అలాగే, అనేక ప్రాంతాల్లో అన్నదానాలు, ప్రసాదాల పంపిణీ జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా కోలాహల వాతావరణం నెలకొంది.





కొత్తూరు జైగోపాల్ గరోడియా పాఠశాలలో దేవతా మూర్తుల వేషధారణలతో చిన్నారులు - షావుకారుపేటలో శ్రీరాములవారి నగర సంకీర్తన

డీఎంకే యువజన మహానాడుకు గిన్నిస్ గుర్తింపు



ప్యారీస్, జనవరి 22: సేలం డీఎంకే యువజన విభాగం మహానాడుకు గిన్నిస్ రికార్డులో చోటుదక్కింది. ఆదివారం జరిగిన మహానాడు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 100 అడుగుల స్తంభంలో 16 అడుగుల పొడవు, 26 అడుగుల వెడల్పుతో ఉన్న పార్టీ జెండాను ఎగురవేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 5 లక్షలకు పైగా పార్టీ శ్రేణులు ఈ మహానాడులో పాల్గొనగా, వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనంలో 10 రకాల వంటకాలు వడ్డించారు. సేలం పెద్దనాయకన్ పాళయంలోని మైదానంలో 9 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన పందిరిలో పార్టీ నిర్వాహకులు కూర్చొని కార్యక్రమాలు వీక్షించేలా 2 లక్షలకు పైగా కుర్చీలు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో, సేలం డీఎంకే యువజన విభాగం మహానాడును ప్రపంచ రికార్డు మహానాడుగా గుర్తిస్తూ యునిక్ వరల్డ్ రికార్డు సంస్థ గిన్నిస్ రికార్డు ధృవీకరణ పత్రాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్, యువజన సంక్షేమ, క్రీడల శాఖ మంత్రి ఉదయనిధికి అందజేసినట్లు అన్నా అరివాలయం సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య 6.18 కోట్లు

- తుది జాబితా విడుదల
- షోళింగనల్లూరులో అత్యధిక ఓటర్లు
- కీల్‌వేలూరులో తక్కువ ఓటర్లు



రాష్ట్ర ఓటర్ల తుది జాబితాను విడుదల చేస్తున్న ఎన్నికల సంఘం ప్రధానాధికారి సత్యప్రద సాహు


చెన్నై, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 6 కోట్లా 18లక్షలా 90 వేలా 348 మంది ఓటర్లు ఉన్నారని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి సత్యప్రదసాహు ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఓటర్ల తుది జాబితాను సోమవారం ఉదయం ఆయన విడుదల చేశారు. ఈ జాబితా ప్రకారం రాష్ట్రంలో 3.14 కోట్ల మంది మహిళలు 3.03 కోట్ల మంది పురుషులు, 8294 మంది హిజ్రాలు ఓటు హక్కును కలిగి ఉన్నారని ఆయన తెలిపారు. అంతేకాకుండా 5,26,265 మంది తొలితరం ఓటర్లుగా ఉన్నారని, కొత్తగా 13 లక్షల మంది ఓటర్లుగా పేర్లను నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. 69శాతం మంది ఓటర్లు ఓటరు గుర్తింపుకార్డును ఆధార్‌కార్డుతో అనుసంధానం చేసుకున్నారని, సోమవారం నుంచే ఓటర్ల జాబితాలో పేర్లను నమోదు చేసుకోవచ్చునని ఆయన తెలిపారు.

షోళింగనల్లూరులో అత్యధికం...

రాష్ట్రంలో అత్యధిక సంఖ్యలో ఓటర్లు కలిగిన శాసనసభ నియోజకవర్గంగా చెంగల్పట్టు జిల్లాలోని షోళింగనల్లూరు ప్రథమ స్థానం పొందిందని, ఆ నియోజకవర్గంలో మొత్తం 6,60,419 మది ఓటర్లు ఉన్నారని, వీరిలో 3,30,522 మంది పురుషులు కాగా, 3,29,783 మంది మహిళలు, 114 మంది హిజ్రాలు ఉన్నారని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి సత్యప్రదసాహు తెలిపారు. ఇక కోయంబత్తూరు జిల్లాలోని గౌండంపాళయం నియోజకవర్గం అత్యధిక సంఖ్యలో ఓటర్లున్న రెండో నియోజకవర్గంగా మొత్తం 4,62,612 మంది ఓటర్లను కలిగి ఉందని చెప్పారు. వీరిలో 2,29,950 మంది పురుషులు, 2,32,538 మంది మహిళలు, 124 మంది హిజ్రాలు ఉన్నారని ఆయన వివరించారు. ఇక రాష్ట్రంలో అతితక్కువ ఓటర్లున్న శాసనసభ నియోజకవర్గంగా నాగపట్టినం జిల్లా కీల్‌వేలూరు నియోజకవర్గం 1,72,140 మంది ఓటర్లను కలిగి ఉందని తెలిపారు. వీరిలో 84,702మంది పురుషులు, 87,435 మంది మహిళలు, ముగ్గురు హిజ్రాలు ఉన్నారని తెలిపారు. ఇదే విధంగా అతితక్కువ ఓటర్లున్న రెండో శాసనసభ నియోజకవర్గంగా చెన్నై జిల్లాలోని హార్బర్ నియోజకవర్గం 1,72,624 మది ఓటర్లతో ద్వితీయ స్థానంలో ఉన్నారు. వీరిలో 89,569 మంది పురుషులు, 82,996 మంది మహిళలు, 59 మంది హిజ్రాలు ఉన్నారని పేర్కొన్నారు. ఓటర్ల తుది జాబితాలను రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి కార్యాలయానికి చెందిన www.voters.eci.gov.in అనే వెబ్‌సైట్‌లో వీక్షించవచ్చునని తెలిపారు. ఓటర్ల జాబితాలో పేర్లను నమోదు చేయాలనుకునేవారు ఓటర్ల నమోదు అధికారి కార్యాలయంలో ఫారం-6ను సమర్పించి దరఖాస్తు చేసుకోవచ్చునని, అలాగే elections.tn.gov.in అనే వెబ్‌సైట్ ద్వారాను దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. గూగుల్‌ప్లే స్టోర్ నుంచి voter helpline appఅనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని దాని ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చునని ఆయన వివరించారు.

బీజేపీతో గవర్నర్ కుమ్మక్కు!

మండిపడ్డ దేవాదాయ శాఖ మంత్రి శేఖర్‌బాబు



చెన్నై, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెస్ట్ మాంబళం కోదండరామాలయాన్ని దర్శించేందుకు వెళ్లినప్పుడు ఆ ఆలయ పూజారుల ముఖాల్లో భయాందోళనలు కనిపించాయంటూ రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవి చేసిన విమర్శను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు తీవ్రంగా ఖండించారు. డీఎంకే ప్రభుత్వాన్ని ఆధ్యాత్మికతకు వ్యతిరేకమైన ప్రభుత్వమని పనిగట్టుకుని ప్రచారం చేస్తున్న బీజేపీ పెద్దలతో గవర్నర్ కుమ్మక్కయినట్లు స్పష్టమవుతోందన్నారు. అయోధ్య రామాలయ ప్రారంభోత్సవం సందర్భంగా సోమవారం రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు రద్దు చేశామని, అన్నదానాలను నిలిపివేశామని ఆ మేరకు దేవాదాయ శాఖ అధికారులు మౌఖిక ఉత్తర్వులు జారీ చేశారని, బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు అన్నామలై, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రోజంతా ప్రభుత్వంపై తిట్ల వర్షం కురిపించారన్నారు. అలాగే, ఓ తమిళ పత్రికలో వచ్చిన తప్పుడు వార్తను పట్టుకుని విమర్శలు చేయవద్దని హితవు పలికినా వారు పట్టించుకోలేదన్నారు. చివరకు కాంచీపురం కామాక్షి ఆలయం వద్ద ఎల్‌ఈడీ స్ర్కీన్‌పై అయోధ్య రామాలయ ప్రారంభోత్సవాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయడానికి పోలీసులు అనుమతించలేదని కూడా విమర్శించారని చెప్పారు. దేవాదాయ శాఖ ఆధీనంలో ఉన్న ఆలయాల్లో ఎల్‌ఈడీ స్ర్కీన్‌పై ప్రసారం చేయడానికి ఆయా ఆలయాల నిర్వహణాధికారులు, పోలీసుల అనుమతి అవసరమని, ఇవేవీ లేకుండా ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్ర్కీన్‌ను తొలగించాల్సి వచ్చిందన్నారు. డీఎంకే అధికారంలోకి వచ్చాకే ఆలయాలన్నీ కొత్త శోభను సంతరించుకున్నాయని, ఇప్పటి వరకూ వెయ్యికి పైగా ఆలయాలకు కుంభాభిషేకాలు జరిపామని గుర్తు చేశారు. ఇక అయోధ్య ఆలయ ప్రారంభోత్సవం జరిగిన సోమవారం రాష్ట్రంలో రెండు రామాలయాలకు కుంభాభిషేకాలు జరిపినట్లు ఆయన పేర్కొన్నారు. సోమవారం ఉదయం గవర్నర్ వెస్ట్‌మాంబళం కోదండరామాలయానికి వెళ్ళినప్పుడు ఆలయ మర్యాదలతో రెడ్‌కార్పెట్ స్వాగతమిచ్చి మరీ దర్శన ఏర్పాట్లు జరిగాయని, వాస్తవాలు ఇలా ఉంటే ఆలయ పూజారుల ముఖాల్లో భయాందోళనలు కనిపించాయని చెప్పడం పచ్చకామెర్లకు గురైన వ్యక్తికి లోకమంతా పచ్చగా కనిపించిందన్న నానుడి గుర్తుకు వస్తోందన్నారు. ఆలయాల్లో మూలవిరాట్టుకు సేవలుచేసే అర్చకులను భగవంతుడి కంటే ఎక్కువగా తాము గౌరవిస్తున్నామని, వారికి జీత భత్యాలను, పండుగ పూట నూతన వస్త్రాలను కూడా అందిస్తున్నామని చెప్పారు. ఏ ఆలయంపైనా తాము అజమాయిషీ చెలాయించడం లేదని, ఆలయాలలో భక్తులందరికీ సులువుగా దర్శన సదుపాయం కల్పిస్తున్నామని మంత్రి శేఖర్‌బాబు వివరించారు.

అయోధ్య ప్రత్యక్ష ప్రసారాల వ్యవహారం ఉత్తర్వు జారీకి సుప్రీం నిరాకరణ



అడయార్, జనవరి 22: అయోధ్య రామాలయ ప్రారంభోత్సవం, రామ్ లల్లా ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసార వ్యవహారంలో జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. పైగా, ఈ ప్రాణ ప్రతిష్ఠ ప్రత్యక్ష ప్రసారం, ప్రత్యేక పూజలు నిషేధిస్తూ రాష్ట్రప్రభుత్వం జారీ చేసి మౌఖిక ఆదేశాలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఈ విషయంలో అధికారులు చట్టానికి లోబడి వ్యవహరించాలని ఆదేశించింది. అయోధ్య రామమందిరంలో సోమవారం నాటి క్రతువులు ఎల్‌ఈడీ స్ర్కీన్లపై ప్రత్యక్ష ప్రసారం చేయడాన్ని రాష్ట్రంలో నిషేధిస్తున్నట్టు స్థానిక పత్రికల్లో కథనాలు వెలువడ్డాయి. ఈనెల 20న జారీ చేసిన మౌఖిక ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ చెన్నైకి చెందిన బీజేపీ నాయకులు, ఆర్‌ఎస్‌ఎస్ నిర్వాహకులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సోమవారం సుప్రీంకోర్టు విచారణ జరిగిపంది. ప్రభుత్వం తరపు న్యాయవాది హాజరై తమ ప్రభుత్వం నుంచి ఆ తరహా ఆంక్షలు ఏవీ లేవని పిటిషనర్లు చేస్తున్న ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమని కోర్టుకు వివరణ ఇచ్చారు. దీంతో ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను ఈనెల 29వ తేదీకి సుప్రీంకోర్టు వాయిదా వేసింది.

రాష్ట్రప్రభుత్వ ప్రతిష్ఠ దెబ్బతీయడానికే...

అయోధ్య ప్రాణప్రతిష్ఠ రోజు స్థానిక ఆలయాల్లో ఎలాంటి పూజలు, భజనలు, ప్రసాద వితరణ, అన్నదానం చేయొద్దని హిందూ దేవాదాయ ధర్మాదాయ మంత్రిత్వ శాఖ నుంచి ఆలయాల నిర్వాహకులకు ఆదేశాలు అందాయంటూ కొన్ని పత్రికల్లో వార్తలు వచ్చాయి. దీనిపై కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ కూడా స్పందించారు. రాష్ట్రంలో 200కు పైగా రామాలయాలు ఉన్నాయని, వాటిలో పూజలను అడ్డుకునేందుకు డీఎంకే ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. అయితే, ఈ ఆరోపణలను రాష్ట్ర ప్రభుత్వం తోసిపుచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బ తీసేందుకు కొన్ని పత్రికలు ఇలాంటి తప్పుడు వార్తలు ప్రచురిస్తున్నాయని మండిపడింది. అలాంటి వాటిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. అలాగే, ప్రైవేటు ప్రాంతాల్లో జరిగే వేడుకలు, పూజలు, భజనలు వంటి కార్యక్రమాలకు పోలీసులు అనుమతి అవసరం లేదని మద్రాస్ హైకోర్టు కూడా తేల్చి చెప్పింది. ఈ విషయంలో రాష్ట్రప్రభుత్వం కూడా ఇదే తరహా అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

వదంతులను నమ్మించడంలో బీజేపీ పెద్దలు దిట్టలు

గవర్నర్ గావుకేకలకు రాజకీయమే కారణం ● సీఎం స్టాలిన్ ధ్వజం



చెన్నై, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్‌లోని కోదండ రామాలయ అర్చకులు, సిబ్బంది ముఖాల్లో భయాందోళనలు కనిపించాయంటూ గవర్నర్ రవి చేసిన వ్యాఖ్యల పట్ల ముఖ్యమంత్రి స్టాలిన్ తీవ్రంగా స్పందించారు. ఆ విమర్శల వెనుక బలమైన రాజకీయ కారణాలు దాగి ఉన్నాయని మండిపడ్డారు. వదంతులను నమ్మించడంలో బీజేపీ పెద్దలు నిష్ణాతులన్నారు. ఈ మేరకు సోమవారం మధ్యాహ్నం ఆయన పార్టీ శ్రేణులకు లేఖ రాస్తూ... గవర్నర్ వ్యాఖ్యలను దుయ్యబట్టారు. ఓ వదంతిని వాట్సప్, టెలివిజన్, వార్తాపత్రికలు తదితర సామాజిక మాధ్యమాల్లో ప్రసారం చేయించి దాన్ని నిజమేనని ప్రజలు నమ్మేలా చేయడంలో బీజేపీ పెద్దలు ఆరితేరారని, ఈ విషయంలో ఢిల్లీ పెద్దల నుంచి రాష్ట్రంలోని బీజేపీ నేతల వరకూ ఎవరికీ మినహాయింపు లేదని పేర్కొన్నారు. అనునిత్యం వదంతులను వ్యాపింపచేయడంలో బీజేపీ పెద్దలు 'వాట్సప్ యూనివర్శిటీలు'గా ఉన్నారని చెబితే అతిశయోక్తి కాదన్నారు. అయోధ్య రామాలయ ప్రారంభోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం ఉన్నట్టుండి బీజేపీ నేతలు రాష్ట్ర దేవాదాయశాఖ ఆధ్వర్యంలోని అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదానాలపై ఆంక్షలు విధించారని ఓ వదంతిని పుట్టించారని, ఆ సమయంలో డీఎంకే యువజన విభాగం మహానాడు సభలో ఉన్న ఆ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు అవన్నీ అవాస్తవాలని వివరణ ఇచ్చారన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తమ ప్రభుత్వంపై, దేవాదాయ శాఖ మంత్రిపై తప్పుడు ఆరోపణలతో చేసిన రాద్ధాంతం కూడా అందరికీ విస్మయం కలిగించిందన్నారు. సోమవారం కాంచీపురం కామాక్షి ఆలయంలో అయోధ్య ఆలయ వేడుకల సందర్భంగా భజన కార్యక్రమాలకు మాత్రమే అనుమతి తీసుకుని అక్కడ అయోధ్య ప్రత్యక్ష ప్రసారాల వీక్షణకు ఎల్‌ఈడీ స్ర్కీన్ ఏర్పాటు చేశారని, ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఆ స్ర్కీన్‌ను తొలగించేందుకు ప్రయత్నిస్తే డీఎంకే సర్కారుకు తీవ్ర పరిణామాలు ఎదురవుతాయంటూ బెదిరింపు ధోరణితో వ్యాఖ్యలు చేయడం మంత్రిగా ఆమె బాధ్యతారాహిత్యాన్ని చాటిచెబుతోందన్నారు. బీజేపీ పెద్దల వదంతులను వ్యాపింపచేయడాన్ని మద్రాసు హైకోర్టు సైతం తీవ్రంగా ఖండించిందన్నారు. ఏ మతానికి చెందినదైనా భక్తి అనేది ప్రజలకు సంతోషాన్ని, ప్రశాంతతను కల్పించాలే తప్ప... సమాజంలోని సమైక్యతకు భంగం కలిగించకూడదన్నారు. రాష్ట్రంలో నియమిత గవర్నర్ పదవిలో ఉన్న రవి తన ఎక్స్ పేజీలో మాంబళం కోదండరామాలయానికి వెళ్లినప్పుడు పూజలు, ఆలయ సిబ్బంది ముఖాల్లో ఏదో తెలియని భయాందోళనలు కనిపించాయంటూ వ్యాఖ్యానించడం గర్హనీయమన్నారు. తమకెలాంటి భయాందోళనలు లేవని ఆ ఆలయ పూజారులు, సిబ్బంది మొత్తుకున్నా పట్టించుకోకుండా వ్యాఖ్యానించడం రాజకీయ కారణం తప్ప మరొకటి కాదని స్టాలిన్ కటువుగా వ్యాఖ్యానించారు.

28న స్టాలిన్ స్పెయిన్ పయనం

పెట్టుబడుల సమీకరణ దిశగా సీఎం స్టాలిన్ ఈ నెల 28న స్పెయిన్‌కు పయనమవుతున్నారు. 2030లోగా వన్ ట్రిలియన్ అమెరికా డాలర్లకు రాష్ట్ర ఆర్థిక ప్రగతిని సాధించాలని లక్ష్యంతో ఈ నెల 8, 9 తేదీల్లో నందంబాక్కం ట్రేడ్ సెంటర్‌లో నిర్వహించిన అంతర్జాతీయ పెట్టుబడిదారుల సదస్సు విజయవంతమైంది. అదే సమయంలో అంచనాలకు మించి 6.64లక్షల కోట్ల మేరకు పెట్టుబడులు పెట్టేందుకు బహుళజాతి సంస్థలు, భారతీయ కంపెనీలు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఈ పరిస్థితులలో స్పెయిన్‌కు వెళ్ళి అక్కడ జరిగే ఆర్థిక సదస్సులో స్టాలిన్ పాల్గొననున్నారు. ఐదు రోజులపాటు ఆయన స్పెయిన్‌లో పర్యటించి అక్కడి పారిశ్రామికవేత్తలతో భేటీ అవుతారు. ఆ సందర్భంగా రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పేందుకు గల సదుపాయాలను గురించి వారికి వివరించనున్నారు. స్టాలిన్‌తోపాటు ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు, పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా, ఆ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు కూడా స్పెయిన్‌లో పర్యటించనున్నారు.

సమాచార దృశ్యిని

రేపు ప్రసన్న పెరుమాళ్ ఆలయ కుంభాభిషేకం

ఐసిఎఫ్, జనవరి 22: కాంచీపురం సేక్కుపేట నడువీధిలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ పెరుమాళ్ ఆలయ కుంభాభిషేకం బుధవారం జరగనుంది. ఈ ఆలయం జీర్ణోద్ధరణ పనులు ఇటీవల పూర్తయ్యాయి. కుంభాభిషేకాన్ని పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం 5 గంటలకు యాగశాల పూజ ప్రారంభమైంది. ఈనెల 24వ తేది ఉదయం 10 గంటలకు మహా కుంభాభిషేకం, సాయంత్రం 6 గంటలకు శ్రీనివాస తిరుకల్యాణోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

నేడు బ్రహ్మపురీశ్వరాలయ రథోత్సవం

ఐసిఎఫ్, జనవరి 22: కాంచీపురం - వందవాసి రోడ్డు, ఉత్తర మేరూర్ యూనియన్ పెరునగర్‌లో ఉన్న పట్టు వరదాంబికై సమేత బ్రహ్మపురీశ్వరాలయ రథోత్సవం మంగళవారం జరగనుంది. ఈ ఏడాది ఆలయ తై పూసోత్సవాలు ఈనెల 17వ తేది ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం, సాయంత్రం స్వామివారు వివిధ వాహనాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం రథోత్సవం, 26వ తేది 22గ్రామదేవతల తైపూస దర్శన కార్యక్రమాలు జరగనున్నాయి.

2.89 లక్షల ఉచిత గ్యాస్ కనెక్షన్లు

ఐసిఎఫ్, జనవరి 22: మూడు నెలల్లో 2.89 లక్షల మందికి ఉచిత వంట గ్యాస్ సిలిండర్ కనెక్షన్లు ఇచ్చినట్లు ఆయిల్ సంస్థలు ప్రకటించాయి. గ్రామాల్లో నివసించే పేదలకు ఉచిత గ్యాస్ కనెక్షన్ ఇచ్చేలా అందజేసేలా ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం అమలులో ఉన్న విషయం తెలిసిందే. ఈ పథకం కింద రాష్ట్రంలో ఇదివరకే 32 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఇచ్చాయి. గత ఏడాది అక్టోబరు నుంచి మూడు నెలల్లో 2.89 లక్షల ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఇచ్చినట్లు ఆయిల్ సంస్థలు తెలిపాయి. వీటిలో పుదుచ్చేరిలో 3,407 కనెక్షన్లు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

తగ్గిన కూరగాయల ధరలు

ఐసిఎఫ్, జనవరి 22: స్థానిక కోయంబేడు మార్కెట్లో కూరగాయల ధరలు తగ్గాయి. సంక్రాంతి సందర్భంగా పెరిగిన కూరగాయల ధరలు దిగుమతులు పెరగడంతో ఎట్టకేలకు తగ్గాయి. ప్రస్తుతం కిలో ఉల్లి రూ.20 నుంచి రూ.24, టమోటాలు రూ.20 నుంచి రూ.25, క్యారెట్ రూ.25 నుంచి రూ.60, బీన్స్ రూ.30 నుంచి రూ.35, బీట్‌రూట్ రూ.60 నుంచి రూ.65, ముల్లంగి రూ.40 నుంచి రూ.50, క్యాబేజీ రూ.12 నుంచి రూ.15, వంకాయలు రూ.10 నుంచి రూ.20, చిక్కుడుకాయలు రూ.25 నుంచి రూ.30, బెండకాయలు రూ.65 నుంచి రూ.70, మునక్కాయలు రూ.140 నుంచి రూ.150 వరకు విక్రయమవుతున్నాయి.

1,000 ప్రాంతాల్లో వైఫై సేవలు

ఐసిఎఫ్, జనవరి 22: నగరంలో 1,000 ప్రాంతాల్లో ఉచిత వై ఫై సేవా పథకం ఫిబ్రవరిలో అందుబాటులోకి రానుందని అధికారులు తెలిపారు. మెరీనా బీచ్, పార్కులు, బస్టాండ్లు, కళాశాల, పాఠశాలలు, బిసెంట్ నగర్ వంటి రద్దీ ఎక్కువగా ఉన్న 1,000 ప్రాంతాల్లో వైఫై సౌకర్యం కల్పించనున్నారు. ఈ సేవలను ఉచితంగా 30 నిమిషాలు పొందవచ్చని అధికారులు తెలిపారు. మొబైల్ ఫోన్ నెంబరు నమోదుచేసి ఓటీపీ ద్వారా ఈ సేవలు పొందవచ్చు. చెన్నై కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇదివరకే 50 ప్రాంతాల్లో ఉచిత వై ఫై సేవలు అందుబాటులో ఉండడం గమనార్హం.

బస్సుల కొనుగోలుకు రూ.91 కోట్లు ఇవ్వండి: ఎంటీసీ

ఐసిఎఫ్, జనవరి 22: పొరుగు ప్రాంతాలకు వెళ్లే వారి సౌకర్యార్థం 100 లోఫ్లోర్ బస్సులు కొనుగోలుకు రూ.91 కోట్లు అందించాలని సీఎండీఏకు ఎంటీసీ లేఖ రాసింది. ప్రస్తుతం ప్రతిరోజు చెన్నై నగరంలో 659 మార్గాల్లో 3,233 ట్రిప్పులు ఎంటీసీ బస్సులు నడుస్తున్నాయని, కిళంబాక్కం బస్ టెర్మినల్ ప్రారంభించడంతో అవసరం పెరిగిందని పేర్కొంది. దీంతో కిళంబాక్కంకు ప్రతిరోజు 298 బస్సులను 2,990 ట్రిప్పులు నడపవలసి వస్తోందని పేర్కొంది. ఎక్కువ లగేజీలతో పొరుగు ప్రాంతాలకు వెళ్లే వారి సౌకర్యార్థం అత్యాధునిక వసతులు కలిగిన 100 లోఫ్లోర్ బస్సులు కొనుగోలుకు రూ.91 కోట్లను సీఎండీఏ నిధుల నుంచి కేటాయించాలని ఎంటీసీ లేఖలో కోరింది.

రూ.500 కోట్ల బాణసంచా విక్రయాలు

ఐసిఎఫ్, జనవరి 22: అయోధ్య రామాలయ కుంభాభిషేకాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా రూ.500 కోట్ల బాణసంచా విక్రయాలు జరిగినట్లు ఉత్పత్తిదారుల సంఘ అధ్యక్షుడు గణేశన్ తెలిపారు. శివకాశిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రామాలయ కుంభాభిషేకం సందర్భంగా ఉత్తర రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో బాణసంచా విక్రయాలు ఎక్కువగా జరిగాయని తెలిపారు. 2023వ సంవత్సరం దీపావళి అనంతరం వర్షాల కారణంగా శివకాశిలో ఉత్పత్తి తక్కువగానే ఉందని, అయినప్పటికీ దీపావ ళి సమయంలో నిల్వ ఉన్నవి, దీపావళి అనంతరం తయా రు చేసినవి అని మొత్తం రూ.500 కోట్ల విలువైన బాణసంచా ఉత్తర రాష్ట్రాల్లో విక్రయించినట్లు ఆయనతెలిపారు.

రూ.44.46 కోట్లతో ఓవర్ హెడ్ ట్యాంకులు

ఐసిఎఫ్, జనవరి 22: స్థానిక మాధవరం మండలంలో రూ.44.46 కోట్లతో ఓవర్ హెడ్ ట్యాంకులు ఏర్పాటు చేసి నిరంతరాయంగా తాగునీరు సరఫరా చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మండలంలో 27వ వార్డు పరిధిలోని ప్రాంతాల్లో 7 వేలకు పైగా నివాసాలున్నాయి. ఇక్కడున్న 3,500 గృహాలకు పబ్లిక్ కొళాయిలు, లారీల ద్వారా తాగునీరు సరఫరా అవుతోంది. ఈ నేపథ్యంలో, ప్రజలకు నియంతరాయంగా తాగునీరు సరఫరా చేసేందుకు రూ.44.46 కోట్లతో పెరియసేర్కాడు కో-ఆపరేటివ్ నగర్, మాధవరం బుక్కరాజ్‌నగర్, తనికాచలం నగర్, కదిర్వేడు, ఎంజీఆర్ నగర్ ప్రాంతాల్లో ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించారు.

జల్లికట్టు ఎద్దు పొడిచి యువకుడి మృతి

అడయార్, జనవరి 22: దిండిగల్ సమీపంలో జల్లికట్టు ఎద్దు పొడిచి యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. జిల్లాలోని తడికొంబులో జల్లికట్టు పోటీలను తాజాగా నిర్వహించారు. ఇందులో 750కు పైగా ఎద్దులు, 450 మంది యువకులు పాల్గొన్నారు. అయితే, ఓ ఎద్దును పట్టుకునేందుకు ప్రయత్నించిన దిండిగల్ పొట్టిపట్టికి చెందిన సెబాస్టియన్ (27) అనే యువకుడిని ఎద్దు పొడిచింది. తీవ్రంగా గాయపడిన ఆ యువకుడిని 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ కన్నుమూశాడు. దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

మైలాపూర్ ఫ్లై ఓవర్ కూల్చివేత పనులు ప్రారంభం

ఐసిఎఫ్, జనవరి 22: మెట్రోరైలు పనుల కారణంగా మైలాపూర్‌లో ఉన్న ఫ్లై ఓవర్ ఒక భాగాన్ని కూల్చే పనులు ప్రారంభమయ్యాయి. రెండో విడత మెట్రోరైలు పనులు మైలాపూర్, రాయపేట ప్రాంతాల్లో జరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మైలాపూర్‌లో పంజాబ్ నేషనల్ బ్యాంక్, తిరువికనగర్ సమీపంలో ఉన్న ఫ్లై ఓవర్ కొంత భాగం కూల్చివేత పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి.

చెన్నైలో 3.90లక్షల మంది ఓటర్లు



రిప్పన్‌భవనంలో చెన్నై జిల్లా ఓటర్ల జాబితాను విడుదల చేస్తున్న ఆ జిల్లా ఎన్నికల అధికారి, కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జే. రాధాకృష్ణన్

చెన్నై, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): చెన్నై నగరంలో ఓటర్ల తుది జాబితా వివరాలను చెన్నై జిల్లా ఎన్నికల అధికారి, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జే.రాధాకృష్ణన్ వెల్లడించారు. ఈ ప్రకారం 16 శాసనసభ నియోజకవర్గాల్లో మొత్తం 3,90,1167 మంది ఓటర్లున్నారని సోమవారం ఉదయం రిప్పన్ భవనంలోని తన కార్యాలయంలో నగరానికి సంబంధించిన ఓటర్ల తుది జాబితాను విడుదల చేశారు. ఆ జాబితా ప్రకారం శాసనసభ నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు...

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	హిజ్రాలు	ఓటర్లు
1.ఆర్కేనగర్	116197	124803	109	241109
2.పెరంబూరు	138040	143667	80	280787
3.కొళత్తూరు	137714	144205	73	281992
4.విల్లివాక్కం	117412	121933	63	239408
5.తిరువిక నగర్	104541	110720	56	215317
6.ఎగ్మూరు	94906	96733	61	191700
7.రాయపురం	93499	97833	66	191398
8.హార్బర్	89569	82996	59	172624
9.చేపాక్ ట్రిప్లికేన్	114226	118394	52	232672
10.థౌజెండ్‌లైట్స్	114478	119681	102	234261
11.అన్నానగర్	133485	138921	96	272502
12.విరుగంబాక్కం	138308	139683	87	278078
13.సైదాపేట	131733	136536	86	268355
14.త్యాగరాయనగర్	113465	116536	48	230049
15.మైలాపూరు	127252	135160	41	262453
16.వేళచ్చేరి	152310	156074	78	308462
మొత్తం ఓటర్లు	1917135	1982875	1157	3901167

ప్రభుత్వ శాఖల పథకాలు ప్రారంభించిన సీఎం స్టాలిన్



ప్యారీస్, జనవరి 22: స్థానిక సెయింట్ జార్జి కోట ప్రాంగణంలోని సచివాయల ప్రాంగణంలో ముఖ్యమంత్రి స్టాలిన్ సోమవారం ప్రభుత్వ వివిధ శాఖల ఆధ్వర్యంలో కొత్త పథకాలు ప్రారంభించారు. గ్రేటర్ చెన్నై పోలీస్ శాఖకు కార్లు, జీపులను జెండా ఊపి ప్రారంభించారు. తమిళనాడు పౌరసరఫరాల శాఖ తరఫున కొత్తగా నిర్మించిన ఆధునిక వరి ధాన్యం సేకరణ గోదాములను ప్రారంభించి, ఆ శాఖలో పనిచేస్తూ మృతిచెందిన ఉద్యోగుల వారసులకు కారుణ్య ప్రాతిపదికన ఉద్యోగ నియామక అందజేశారు. కాగా, దివ్యాంగులకు ఉత్తమ సేవలందించిన సంఘ సేవకులు, స్వచ్ఛంద సంస్థలు, ఉత్తమ టీచర్లు, ప్రమాదాలు లేకుండా వాహనాలు నడిపిన డ్రైవర్లు, కండక్టర్లకు అవార్డులు పంపిణీ చేశారు. జౌళి శాఖ ఆధ్వర్యంలో చిన్నతరహా జౌళి పార్కుల పథకం కింద కొత్త సంస్థల ప్రారంభించనున్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు చెక్కులను సీఎం అందజేశారు. ఉన్నత విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలు, ఇంజనీరింగ్ కళాశాలలు, పాలిటెక్నిక్ లు, విశ్వవిద్యాలయాల్లో ప్రాంగణాల్లో నూతనంగా నిర్మించిన తరగతి గదులు, ప్రయోగ శాలలు, ఆడిటోరియం, అతిథిగృహం, జిమ్, సిబ్బంది క్వార్టర్స్ తదితరాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. సమాచార ప్రసార శాఖ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధులు వీరమా మునివర్, నామక్కల్ కవీంజర్ రామలింగం పిళ్లై, వీరనారి కుయిలి, మహాత్మాగాంధీ స్నేహితుడు జీవ తదితరుల విగ్రహాలను వారికి సంబంధించిన జిల్లాల్లో ప్రతిష్ఠించేందుకు శంకుస్థాపన చేశారు. చివరగా, హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో తిరువళ్లూర్ జిల్లా పెరియపాళంలో ప్రసిద్ధిచెందిన భవాని అమ్మవారి ఆలయం, విల్లుపురం జిల్లా మేల్‌మలయనూరు అంకాళ పరమేశ్వరి ఆలయం, కోయంబత్తూర్ జిల్లా ఆనమలై మాసాని అమ్మవారి ఆలయాల్లో నిత్యాన్నదాన పథకాన్ని సీఎం స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు.

లోక్‌సభ ఎన్నికలకు అన్నాడీఎంకే సిద్ధం

● ప్రత్యేక కమిటీల ఏర్పాటు

చెన్నై, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధమవుతోంది. ఆ మేరకు సీట్ల సర్దుబాట్లపై మిత్రపక్షాలతో చర్చించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్టు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ సీఎం ఈపీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. చర్చల కమిటీతోపాటు ఎన్నికల మేనిఫెస్టో తయారీ కమిటీ, ఎన్నికల ప్రచార కమిటీ, ఎన్నికల ప్రకటనల కమిటీకి కూడా సభ్యులను నియమించినట్లు పేర్కొన్నారు. శాసనసభ్యులు కేపీ మునుసామి, దిండుగల్ శీనివాసన్, పి. తంగమణి, ఎస్పీ వేలుమణి, పి బెంజమిన్‌తో చర్చలకమిటీని ఏర్పాటు చేశారు. ఇదే విధంగా ఎన్నికల మేనిఫెస్టో తయారీ కమిటీలో ఇరా విశ్వనాధన్, సి.పొన్నయ్యన్, పొల్లాచ్చి వి జయరామన్, డి.జయకుమార్, సీవీ షణ్ముగం, ఎస్ సెమ్మలై, పి.వలర్మతి, ఒఎస్ మణియన్, ఆర్బీఉదయకుమార్, వైగై సెల్వన్ సభ్యులుగా ఉంటారని ఈపీఎస్ తెలిపారు.

ప్రచార కమిటీ...

అన్నాడీఎంకే ప్రచార కమిటీలో ఎం.తంబిదురై, కే.ఏ.సెంగోటయ్యన్, ఎన్. దళవాయిసుందరం, సెల్లూరు కే రాజు, పి.ధనపాల్, కేపీ అన్బళగన్, ఆర్.కామరాజ్, ఎస్ గోకుల ఇందిరా, ఉడుమలై కే రాధాకృష్ణన్, ఎస్ఆర్ శివపతి సభ్యులుగా ఉంటారు. ఇక ఎన్నికలకు సంబంధించి ప్రకటనల కమిటీలో డాక్టర్ సి.విజయభాస్కర్, కడంబూరు సి. రాజు, కేటీ రాజేంద్రబాలాజీ, అగ్రి ఎస్ఎస్ కృష్ణమూర్తి, డాక్టర్ పి.వేణుగోపాల్, డాక్టర్ పరమశివం, ఐఎస్ ఇన్బదురై, ఎస్.అబ్దుల్ రహీం, వీవీఆర్ రాజ్ సత్యన్, వీ.ఎం రాజలక్ష్మి సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీలకు పార్టీ నాయకులు, జిల్లా శాఖ నాయకులు, అనుబంధ సంఘాల సభ్యులు సహకరించాలని ఈపీఎస్ కోరారు.



చెన్నైలో దోమల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చిస్తున్న మేయర్ ఆర్ ప్రియ



చెన్నై మహానగర అభివృద్ధి సంస్థ సమీక్షా సమావేశంలో పాల్గొన్న మంత్రి పీకే శేఖర్‌బాబు, మేయర్ ఆర్ ప్రియ, అధికారులు

రాష్ట్రంలో ఒకే విడతలో లోక్‌సభ ఎన్నికలు



చెన్నై, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలు ఒకే విడతగా జరుగుతాయని ఎన్నికల సంఘం అధికారులు చెబుతున్నారు. లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ ఫిబ్రవరి నెలాఖరు లేదా మార్చి మొదటి వారంలో వెలువడే అవకాశాలు ఉన్నాయంటున్నారు. రాష్ట్రంలోని 39 నియోజకవర్గాల్లో ఇప్పటివరకూ ఎన్నికల సందర్భంగా తీవ్రమైన అల్లర్లకు తావులేకుండా ప్రశాంతంగా జరిగినట్లు పూర్వ రికార్డులు తెలియజేస్తున్నాయి. దీంతో కేంద్రం ఎన్నికల సంఘం రాష్ట్రంలో ఒకే విడతలో ఎన్నికలను నిర్వహించేందుకు అంగీకరించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు రాష్ట్రంలో మూడేళ్లకు పైగా ఒకే చోట, లేదా ఒకే శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులను ఈనెల 31లోగా బదిలీ చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి సత్యప్రద సాహు ఆదేశించారు. ఆ దిశగానే రాష్ట్ర ప్రభుత్వం బదలీ చేయాల్సిన ఉద్యోగుల వివరాలను ఆయా శాఖల నుంచి సేకరిస్తోంది.

తెన్‌కాశిలో శ్రీరాముడి నీటి బుగ్గ వద్ద పూజలు



నీటి బుగ్గ వద్ద ప్రార్థనలు చేస్తున్న ప్రజలు

చెన్నై, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అయోధ్య ఆలయంలో శ్రీరామ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా తెన్‌కాశి జిల్లా పూలాంకుళంలో శ్రీరాముడి నీటి బుగ్గ వద్ద సోమవారం ఉదయం స్థానికులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూలాంకుళంలోని ఓ కొండ మీద శతాబ్దాల తరబడి ఓ రాతి పాదపు ఆకారాన్ని రాముడి పాదంగానే స్థానికులు ఆరాధిస్తున్నారు. ఆ పాదానికి సమీపంలో బండరాయి నడుమ ఓ నీటి బుగ్గ ఉంది. రాముడు సీతాదేవిని వెదకుతూ దాహం వేసి ఆ నీటిబుగ్గలోని నీటిని తాగారని, అప్పటి నుంచి నిరంతరం జలం ధార ప్రవహిస్తూనే ఉందని స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అయోధ్యలో శ్రీరామ ప్రాణ ప్రతిష్ఠ జరుగుతుండటంతో గ్రామస్తులు రాముడి పాదం వద్ద, రాముడి నీటి బుగ్గ వద్ద పూజలు నిర్వహించారు. నీటి బుగ్గనుంచి వెలువడుతున్న జలాన్ని సేవించారు.

ఆగిన బాల్యవివాహం

ఐసిఎఫ్, జనవరి 22: బాల్యవివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. తిరువళ్లూర్ జిల్లాకు చెందిన 17 ఏళ్ల బాలికకు 21 ఏళ్ల యువకుడితో సోమవారం ఆలయం లో వివాహం జరిపేందుకు ఏర్పాట్లు జరిగాయి. ఈ సమాచారం అందుకున్న సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, పోలీసులు ఆదివారం బాలిక ఇంటికి వెళ్లి, ఆమె తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి వివాహాన్ని నిలిపివేశారు.

సైన్స్ సమాఖ్య నూతన కార్యవర్గం ఎంపిక



సైన్స్ క్యాలెండర్ ఆవిష్కరణ

వేలూరు, జనవరి 22: తమిళనాడు సైన్స్ సమాఖ్య 18వ జిల్లా సదస్సు సోమ వారం జరిగింది. స్థానిక ఉపాధ్యాయుల హోంలో జ రిగిన ఈ సదస్సులో నూత న కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్య క్షురాలిగా అముద, సెక్రట రీగా జనార్దనన్, కోశాధికారిగా కుమరన్, ఉపాధ్యక్షులుగా విశ్వనాథన్, దేవి, పొన్‌వల్లవన్, గాయత్రి, గణేశన్ ఎంపికయ్యారు. అలాగే, జిల్లా కార్యకర్తల కమిటీ సభ్యులుగా కుమరన్, వేలు, రాము, వేల్‌మురుగన్, రాధాకృష్ణన్ ఎంపికయ్యారు. సదస్సులో భాగంగా 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

రూ.130 కోట్లతో గ్రంథాలయాల భవనాలు

ఐసిఎఫ్, జనవరి 22: రాష్ట్రంలో తొలివిడతగా రూ.130 కోట్లతో 838 గ్రంథాలయాలకు త్వరలో అనుసంధాన భవనాలు నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 4,658 గ్రంథాలయాలున్నాయి. కేంద్రప్రభుత్వం ఈ ఏడాది రుణ సహాయం రూ.200 కోట్ల ప్రకటించి, తొలివిడతగా రూ.100 కోట్లు విడుదల చేసింది. ఇందులో గ్రంథాలయ శాఖ వాటా 30 శాతం కలిపి రూ.130 కోట్లతో పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. గ్రంథాలయ పన్ను వసూళ్ల ద్వారా కేంద్రప్రభుత్వ రుణాన్ని వడ్డీ లేకుండా తిరిగి చెల్లిస్తామన్నారు. సొంత భవనాలు లేని గ్రంథాలయాలకు ప్రాధాన్యం ఇచ్చి అనుసంధాన (లింక్) భవనాలు నిర్మించనున్నారు.

పొన్నై నుంచి చెన్నైకి బస్సు ప్రారంభం



బస్సు సర్వీసు ప్రారంభిస్తున్న మంత్రి దురైమురుగన్

వేలూరు, జనవరి 22: కాట్పాడి డివిజన్ పొన్నై నుంచి చెన్నైకి కొత్త బస్సు సేవలు ప్రారంభమయ్యాయి. సోమవారం జరిగిన కార్య క్రమంలో నీటివనరుల శాఖ మంత్రి దురైమురుగన్ పాల్గొని, జెండా ఊపి బస్సు సర్వీసు ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ కుమా రవేల్ పాండ్యన్, విల్లుపురం రీజియన్ రవాణా సంస్థ జనరల్ మేనేజర్ గణ పతి, కాట్పాడి యూనియన్ కమిటీ అధ్యక్షుడు వేల్‌మురుగన్ పాల్గొన్నారు.

24 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

అడయార్, జనవరి 22: కేరళ రాష్ట్రానికి అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 24 టన్నుల రేషన్ బియ్యాన్ని నెల్లై పోలీసులు స్వాధీనం చేసుకుని, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. తిరునెల్వేలి మార్గం మీదుగా కేరళ రాష్ట్రానికి రేషన్ బియ్యాన్ని భారీగా తరలిస్తున్నట్టు జిల్లా సిలంబరసన్‌కు సమాచారం వచ్చింది. దీంతో ఆయన ఆదేశాల మేరకు సీవలపేరి చెక్‌పోస్టులో ప్రత్యేక బృందం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీలో 45 నుంచి 50 కేజీల బరువుతో కూడిన 400 బస్తాల్లో ప్యాకింగ్ చేసిన 19 టన్నులు, మరో షెడ్డులో దాచివుంచిన 5 టన్నుల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి లారీ యజమాని అయిరం (35), రాజాకన్ను (39) అనే ఇద్దరిని అరెస్టు చేశారు. వీరిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.



చెన్నై టి.నగర్ టీటీడీ ఆలయంలో శ్రీరామజన్మభూమి క్షేత్ర ప్రాణప్రతిష్ఠ వేడుకల్లో సోమవారం సాయంత్రం గాత్ర కచేరి చేస్తున్న పద్మభూషణ్ డాక్టర్ సుధా రఘునాథన్



వేలూరు కలెక్టర్ కార్యాయంలో సోమవారం అంగీకరించిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఓటరు జాబితా విడుదల చేస్తున్న ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమరవేల్ పాండ్యన్

నేడు అసోం భవన్ ముట్టడి: కాంగ్రెస్

అడయార్, జనవరి 22: 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' కొనసాగిస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై అసోంలో అధికార భారతీయ జనతా పార్టీకి చెందిన నేతలు దాడి చేశారు. ఈ దాడిని ఖండిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలు, నేతలు మంగళవారం నగరంలోని అసోం భవన్‌ను ముట్టడించనున్నారు. ఈ విషయంపై టీఎన్‌సీసీ ఎస్సీఎస్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ రంజన్‌కుమార్ సోమవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాహుల్ చేపట్టిన రెండో విడత భారత్ జోడో న్యాయ్ యాత్ర ప్రస్తుతం అసోం రాష్ట్రంలో జరుగుతోందన్నారు. ఈ యాత్రలో కొందరు బీజేపీ కార్యకర్తలు హద్దుమీరి ప్రవేశించి దాడికి పాల్పడ్డాయన్నారు. ఈ దాడిని ఖండిస్తూ నగరంలోని అసోం భవన్‌ను ముట్టడించనున్నట్టు ప్రకటించారు. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో పళ్లికరణిలోని అసోం భవన్ ముట్టడి జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

సముద్రంలో స్నానానికి వెళ్లిన విద్యార్థి మృతి

ప్యారీస్, జనవరి 22: కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరిలో స్నేహితులతో కలసి సముద్ర స్నానానికి వెళ్లిన ఓ విద్యార్థి అలల తాకిడికి గురై మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పుదుచ్చేరి ఉరుగంబాక్కంకు చెందిన ఆటోడ్రైవర్ మురుగన్ కుమారుడు జగదీశ్ (16) ఓ ప్రైవేటు పాఠశాలలో ప్లస్‌వన్ చదువుతున్నాడు. ఆదివారం ఉదయం ఆరుగురు స్నేహితులతో కలసి పాండి సముద్రతీరానికి వెళ్లి సముద్రంలో దిగారు. ఆ సమయంలో అలల తాకిడిలో చిక్కుకొని ఊపిరాడక జగదీశ్ మృతిచెందారు. ఈ ఘటనపై అతని స్నేహితులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నడి సముద్రంలో జాలరికి గుండెపోటు

అడయార్, జనవరి 22: రామనాథపురం జిల్లాకు చెందిన అర్గీస్ (47) అనే జాలరి నడి సముద్రంలో గుండెపోటుతో మృత్యువాతపడ్డాడు. ఈనెల 18న పాంబన్ ప్రాంతానికి చెందిన అర్గీస్‌తో పాటు మరో తొమ్మిది మంది జాలర్లు సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. వీరంతా ఆదివారం వేదారణ్యం ప్రాంతంలో చేపల వేట కొనసాగిస్తుండగా, అర్గీస్‌కు ఉన్నట్టుండి గుండెపోటు రావడంతో తీవ్ర అస్వస్థతకు లోనయ్యాడు. వెంటనే భారత నావికా దళానికి సమాచారం చేరవేయగా, వారు హుటాహుటిన వచ్చి అర్గీస్‌కు ప్రథమ చికిత్స అందించారు. అయితే, ఆయన ఆరోగ్య క్షీణించడంతో అక్కడే ప్రాణాలు కోల్పోయాడు.

పుళల్ జైలులో ఖైదీ మృతి

అడయార్, జనవరి 22: స్థానిక పుళల్ సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న సెంగోట్టయ్యన్ (71) అనే ఖైదీ మృతి చెందాడు. చెన్నై సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ విభాగం నమోదు చేసి ఒక క్రిమినల్ కేసులో గత యేడాది అక్టోబరు నెలలో అరెస్టు చేశారు. ప్రస్తుతం విచారణ ఖైదీగా ఉన్న సెంగోట్టయన్ కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఆయన అనారోగ్యానికి గురికావడంతో ప్రభుత్వ స్టాన్లీ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ కన్నుమూశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి



ఘటనలో నుజ్జునుజ్జయిన కార్లు

వేలూరు, జనవరి 22: తిరుపత్తూర్ జిల్లా పచ్చకుప్పం పాలారు సమీపంలోని బెంగళూరు - చెన్నై జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారు జామున రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో తల్లి, కొడుకు సహా ముగ్గురు మృతి చెందగా, మరో నలుగురికి గాయాలయ్యాయి. వేలూరు జిల్లా గుడియాత్తం సంతపేట ప్రాంతానికి చెందిన నగల కార్మికులు శరవణన్, శాంతి దంపతుల కుమారుడు మైత్రేయన్ (21). ధర్మపురిలోని బంధువుల ఇంటికి కారులో వెళ్లి తిరుగు ప్రయాణమయ్యాయి. అలాగే, బెంగుళూరు నగరానికి చెందిన మాధవన్, ఆయన భార్య రోజా, కుమారులు కుమరేశన్, శివతో కలసి చెన్నై మనలి పార్థసారథి నగర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లి తిరుగుప్రయాణమయ్యారు. ఆంబూరు పచ్చకుప్పం మార్గంగా వస్తున్న మాధవన్ ప్రయాణిస్తున్న కారు హఠాత్తుగా అదుపుతప్పి రోడ్డు పక్కనున్న డివైడర్‌ను ఢీకొని శరవణన్ కారును ఢీకొంది. ఈ ఘటనలో శరవణన్, రోజా, శివ సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. సమాచారం అందుకున్న ఆంబూరు తాలూకా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఆంబూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని తిరుపత్తూర్ ఎస్పీ ఆల్బర్ట్‌జాన్ పరిశీలించారు.

ఉళుందూర్‌పేట సమీపంలో ...

ఇద్దరి మృతి ● నలుగురికి గాయాలు

ప్యారీస్, జనవరి 22: కళ్లకుర్చి జిల్లా ఉళుందూర్‌పేట సమీపంలో సెంటర్ మీడియన్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో కానిస్టేబుల్, ఆయన భార్య మృతిచెందగా, మరో నలుగురికి గాయాలయినట్లు పోలీసులు తెలిపారు. స్థానిక తాంబరం పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేసిన బాలమురుగన్ (32), తన సతీమణి వినోదినితో కరూర్‌లో ఉన్న అత్తారింటికి వెళ్లి సోమవారం ఉదయం కారులో తిరుగుముఖం పట్టారు. ఉళుందూర్‌పేట సమీపంలోని పాలిగ్రామం వంతెన వద్దకు చేరుకున్న సమయంలో కారు టైర్ హఠాత్తుగా పేలడంతో అదుపుతప్పి సెంటర్ మీడియన్‌ను దాటుకొని ఎదురు వైపు నుంచి వచ్చిన కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలమురుగన్, వినోదిని అక్కడికక్కడే మరణించగా, మరో కారులో ప్రయాణం చేసిన తిరుచ్చికి చెందిన బాలసుబ్రమణ్యం సహా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలిసి అక్కడకు చేరుకున్న ట్రాఫిక్ విభాగం పోలీ సులు మృతదేహాలను స్వాధీనం చేసుకొని, క్షతగాత్రులను ప్రభుత్వాసుపత్రికి తరలిం చి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

పుదుచ్చేరిలో కుప్పకూలిన మూడంతస్తుల భవనం



కూలుతున్న భవనం

పుదుచ్చేరి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరిలో నూతనంగా నిర్మించిన మూడంతస్తుల భవనం హఠాత్తుగా కుప్పకూలింది. అయితే ఈ ఘటనలో అదృష్టవశాత్తు ఎవరికీ గాయాలు కాలేదు. పుదుచ్చేరి నగరం మెట్టు ప్రాంతం నుంచి మురికి కాలువల్లో విడుదల చేస్తున్న నీరు ఉప్పనారు వాగులో చేరుతుంది. గత కొన్నేళ్లుగా ఈ వాగులో ఎలాంటి పూడికతీత పనులు చేపట్టలేదని తెలిసింది. ఈ నేపథ్యంలో, మరమలై అడిగళ్ రోడ్డు నుంచి కామరాజర్ రహదారి మీదుగా ఉప్పనారు వాగుకు అడ్డంగా వంతెన నిర్మించేందుకు నిర్ణయించారు. అయితే, కాంట్రాక్టర్లకు ఒప్పందం ప్రకారం నగదు పంపిణీ చేయని కారణంతో ఈ పనులు వాయిదాపడ్డాయి. ఇదిలా ఉండగా, మరమలై అడిగళ్ రోడ్డు దాటుకొని ఆటుపట్టి మీదుగా ఎక్స్‌కవేటర్ ద్వారా సోమవారం మధ్యాహ్నం వాగులో పూడికతీత పనులు చేపట్టారు. అందువల్ల వాగు తీరం వెంట నిర్మించిన మూడంతస్తుల భవనం హఠాత్తుగా కుప్పకూలింది. ఈ ఘటనపై కేసు నమోదుచేసి పోలీసులు జరిపిన విచారణలో... కుప్పకూలిన ఇల్లు శేఖర్-చిత్ర దంపతులు నూతనంగా నిర్మించి ఇటీవల గృహప్రవేశం చేసినట్లు తెలిసింది. కాగా, ఆ ఇంట్లో ఎవరూ లేని కారణంగా ప్రాణాపాయం తప్పిందని, వాగులో స్థాయిని మించి మట్టి తవ్వకాలు జరపడం వల్లే ఈ నూతన భవనం కూలిందంటూ స్థానికులు రాస్తారోకో చేపట్టారు.

విడుదలకు సిద్ధంగా ఏడు చిత్రాలు


'సింగపూర్ సెలూన్'లో ఆర్జే బాలాజీ - మేఘా ఆకాష్

కొత్త సంవత్సరం జనవరి నెల నాలుగో శుక్రవారం ఏకంగా ఏడు చిత్రాలు విడుదలకు సిద్ధమయ్యాయి. ఇవన్నీ చిన్న హీరోలు నటించిన సినిమాలే. ఈ యేడాది ఆరంభంలో అంటే మొదటి, రెండు శుక్రవారాల్లో నాలుగు చొప్పున చిత్రాలు విడుదలయ్యాయి. మూడో శుక్రవారం ఒక్కటంటే ఒక్క సినిమా కూడా విడుదల కాలేదు. ఈ క్రమంలో ఈ నెల 26వ తేదీన శుక్రవారం రానుండగా, ఒక్క రోజు ముందు అంటే 25వ తేదీ గురువారం ఏకంగా ఏడు చిత్రాలు విడుదలకానున్నాయి. ఈనెల 25న తైపూసం, 26న రిపబ్లిక్ డే వేడుకలు, ఆ తర్వాత శని, ఆదివారాలు ఇలా వరుసగా నాలుగు రోజుల పాటు సెలవులు వస్తున్నాయి. దీంతో నిర్మాతలు తమ చిత్రాలను విడుదల చేసేందుకు ముందుకు వచ్చారు. ఫలితంగా ఈనెల 25న 'బ్లూస్టార్', 'సింగపూర్ సెలూన్', 'ముడకరుత్తాన్', 'తూక్కుదురై', జనవరి 26వ 'లోకల్ సరక్కు', 'త.నా', 'నియది' చిత్రాలు విడుదలవుతున్నాయి.


'వైట్‌రోజ్'లో కయల్ ఆనంది

'కయల్' ఆనంది 'వైట్‌రోజ్' షూటింగ్ పూర్తి

పూంపార్రై మురుగన్ ప్రొడక్షన్స్ బ్యానరుపై ప్రముఖ దర్శకుడు సుశి గణేశన్ వద్ద అసిస్టెంట్‌గా పనిచేసిన రాజశేఖర్... దర్శకుడిగా పరిచయమవుతూ తెరకెక్కించిన 'వైట్‌రోజ్' చిత్రీకరణ పూర్తిచేసుకుంది. కయల్ ఆనంది ప్రధాన పాత్రను పోషించిన ఈ సైకలాజికల్ థ్రిల్లర్‌లో నిర్మాత, నటుడు ఆర్.కే.సురేష్ ప్రతినాయకుడి పాత్రను పోషించారు. విజిత్ హీరో. వీరితో పాటు రూసో శ్రీధరన్, శశిలయ, గణేశన్, రామనాథన్ తదితరులు ఇతర పాత్రలు పోషించారు. ఇళయరాజా సినిమాటోగ్రఫీ అందించగా, జోహన్ సెవణేష్ సంగీతం సమకూర్చారు. 'కమలి ఫ్రమ్ నడుకావేరి', 'ఎన్ ఆలోడ సెరుప్పు కాణోం'చిత్రాల తర్వాత కయల్ ఆనంది సోలో హీరోయిన్‌గా నటించిన సినిమా కావడం గమనార్హం. ఈ సినిమాలో పోలీస్ కంట్రోల్ రూం అత్యంత కీలక పాత్రను పోషించనుంది. ఈ కంట్రోల్ రూం వాస్తవ రూపంలో ఉండేందుకు భారీ వ్యయంతో సెట్‌ను నిర్మించి, అందులో చిత్రీకరణ పూర్తి చేశారు. ప్రస్తుతం షూటింగ్ పూర్తికావడంతో పోస్ట్ ప్రొడక్షన్ పనులను జరుపుకుంటోంది. వైద్య రంగంలో జరిగే చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నామని, మంచి సందేశాన్ని ఇచ్చే చిత్రంగా ఉంటుందని దర్శకుడు రాజశేఖర్ తెలిపారు.

చిత్రజ్యోతి

పార్తిబన్ మరో ప్రయోగం 'టీన్జ్'



కోలీవుడ్‌లో మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న రాధాకృష్ణన్ పార్తిబన్.. మరో కొత్త ప్రయోగానికి తెరతీశారు. కేవలం చిన్నారులతో చిత్రాన్ని నిర్మించేందుకు సన్నాహాలు చేశారు. 'టీన్జ్' పేరుతో తెరకెక్కే ఈ చిత్రాన్ని.. కాల్డ్‌వెల్ నెల్‌నంబి, డాక్టర్ బాల స్వామినాథన్, డాక్టర్ పించి శ్రీనివాసన్, రంజిత్ దండపాణితో కలిసి పార్తిబన్ స్వయంగా నిర్మించడమే కాకుండా, దర్శకత్వం కూడా వహిస్తున్నారు. గవెమిక్ అరి ఛాయాగ్రహణం, డి.ఇమ్మాన్ సంగీతం అందిస్తున్నారు. థ్రిల్లింగ్ అడ్వెంచర్ జోనర్‌లో బయోస్కోప్ డ్రీమ్స్ ఎల్ఎల్‌పీ, అకీరా ప్రొడక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఆర్.పార్తిబన్ ఇంతకుముందు నిర్మించిన 'ఇరవిన్ నిళల్ సింగిల్ షాట్ మూవీ దేశ విదేశాల్లో ప్రశంసలతో పాటు అవార్డులు, రివార్డులు అందుకుంది. ఈ సినిమాలోని 'మాయవా తూయవా' పాటకు నేపథ్యగానం చేసిన శ్రేయ ఘోషల్‌కు జాతీయ అవార్డు సైతం వచ్చింది.

రజనీ సరసన నయనతార?



సూపర్‌స్టార్ రజనీకాంత్ సరసన హీరోయిన్ నయనతార మరోమారు నటించనున్నట్టు కోలీవుడ్ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో 'జైలర్‌'లో నటించిన రజనీ... ఇపుడు టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో 'వేట్టైయన్'లో నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసిన తర్వాత 'జైలర్-2'లో నటించనున్నట్టు వార్తలు వస్తున్నాయి. విగ్రహాల స్మగ్లింగ్ ముఠా నుంచి తన కుమారుడిని రక్షించిన తర్వాత రజనీకాంత్.. తన కుమారుడిని చంపేస్తాడు. ఆ తర్వాత ఏం జరిగిందన్నది సస్పెన్స్. ఇక్కడ నుంచి రెండో భాగాన్ని రూపొందించాలన్న ఆలోచనలో డైరెక్టర్ నెల్సన్ దిలీప్‌కుమార్ ఉన్నారు. విగ్రహాల స్మగ్లింగ్ ముఠా, రజనీ మధ్య జరిగే సంఘటనల ఆధారంగా స్టోరీని డెవలప్ చేసి తెరకెక్కించేలా సన్నాహాలు చేస్తున్నారు. తొలిభాగంలో రజనీకాంత్ భార్యగా రమ్యకృష్ణ నటించగా, రెండో భాగంగా నయనతారను ఎంపిక చేయనున్నట్టు కోలీవుడ్ టాక్. ఈ వార్తలు వాస్తవరూపం దాల్చితే రజనీ సరసన నయనతార ఆరోసారి జతకట్టినట్టు అవుతుంది. గతంలో వీరిద్దరు 'చంద్రముఖి', 'కుచేలన్', 'శివాజీ', 'దర్బార్', 'అన్నాత్త' వంటి చిత్రాల్లో నటించారు.



కంచి కామాక్షి ఆలయంలో భక్తులతో కలిసి ఎల్‌ఈడీ స్క్రీన్‌పై అయోధ్య ఆలయంలో శ్రీరామ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న నిర్మలా సీతారామన్

ఆలయాల్లో అధికార దుర్వినియోగం

● డీఎంకే సర్కారుపై కేంద్రమంత్రి నిర్మలమ్మ ఆగ్రహం

చెన్నై, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వం ఆలయాల్లో అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని, ప్రత్యేకించి అయోధ్య ఆలయంలో శ్రీరామ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ ప్రత్యక్ష ప్రసారాలను ప్రజలు చూడకుండా కుటిల ప్రయత్నాలు సాగించిందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మండిపడ్డారు. కాంచీపురంలోని కామాక్షి ఆలయంలో సోమవారం ఉదయం నిర్వహించిన భజనలో ఆమె పాల్గొన్నారు. ఆ సందర్భంగా విలేకరులతో ఆమె మాట్లాడుతూ... అయోధ్య ప్రత్యక్ష ప్రసారాలను వీక్షించేందుకు బీజేపీ రాష్ట్ర నాయకులు చేసిన ఏర్పాట్లను అడ్డుకునేందుకు రాష్ట్రప్రభుత్వ తీవ్రంగా ప్రయత్నించిందన్నారు. తొలుత అయోధ్య వేడుకల సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహించకూడదని మౌఖిక ఉత్తర్వులు జారీ చేసిందని, ఆ వార్త ఓ తమిళ పత్రికలో వచ్చిన వెంటనే పాలకులు ఖండించకుండా తాను విమర్శలు చేసిన మీదటే అలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదంటూ వివరణ ఇచ్చిందన్నారు. అటు పిమ్మట కామాక్షి ఆలయంలో తాను పాల్గొంటున్నానని తెలిసీ, అయోధ్య వేడుకల ప్రత్యక్ష ప్రసారం కోసం ఎల్‌ఈడీ స్క్రీన్‌ను తొలగించి, గంట తర్వాత ఏర్పాటు చేశారన్నారు.


కవాతు నిర్వహిస్తున్న మహిళా పోలీసులు


రాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు


మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న సైనిక దళం సభ్యులు

అలరించిన రిపబ్లిక్‌డే రిహార్సల్స్

చెన్నై, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెరీనాబీచ్ కామరాజర్ రోడ్డులో సోమవారం ఉదయం నిర్వహించిన రిపబ్లిక్‌డే రెండో విడత రిహార్సల్స్ చూపరులకు కనువిందు చేశాయి. కార్మికుల విగ్రహ కూడలి వద్ద త్రివిధ దళాలు నిర్వహించిన కవాతు, నగరంలోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు నిర్వహించిన నృత్యాలు రహదారికి ఇరువైపులా నిలిచిన నగరవాసులను ఆకట్టుకున్నాయి. ఇదే విధంగా ఎన్‌సీసీ కేడెట్లు, కేంద్ర పారిశ్రామిక భద్రతాదళం, రైల్వే భద్రతాదళం, రాష్ట్ర పోలీసు శాఖ, కమెండో దళం, అగ్నిమాపక దళం సభ్యులు బ్యాండ్ వాయిద్యాలకు అనువుగా కవాతు నిర్వహించారు. ఇక పాఠశాల విద్యార్థినులు చేసిన శిలంబాట్టం, మయిలాట్టం, ఒయిలాట్టం నృత్యాలు అలరించాయి. ఈ రిహార్సల్స్ కారణంగా ఉదయం 6 గంటల నుంచి 8 గంటల దాకా కామరాజర్ రోడ్డులో వాహనాల రాకపోకలపై నిషేధం విధించారు. ఇక చివరి విడత రిహార్సల్స్ బుధవారం జరుగనున్నాయి.


నృత్యం చేస్తున్న విద్యార్థినులు



మద్రాసు మిర్చి వర్తక సంఘంలో ప్రత్యేక పూజలు - అక్షయబాబా మందిరంలో సీతారామలక్ష్మ ఆంజనేయ స్వామివార్లకు ప్రత్యేక పూజలు

కోలాహలం... బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన


కొరట్టూరు కోదండ రామాలయంలో ప్రత్యేక అలంకరణలో సీతారాములు

ప్యారీస్, జనవరి 22: అయోధ్య రామాలయంలో సోమవారం బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కోలాహలంగా నిర్వహించిన నేపథ్యంలో కొరట్టూరు అగ్రహారంలోని శ్రీ కోదండ రామాలయం ప్రాంగణంలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వివిధ హిందూ సంస్థల భజన, మహిళల రామజ్యోతి పూజ, మహా హారతి పూజలు నిర్వహించారు. ఇక అయోధ్య నుంచి పొందిన అక్షతలు, రామాలయ ఫొటో, అన్నప్రసాదాల వితరణ జరిగింది. శ్రీ ఆంధ్ర కళా స్రవంతి ఆధ్వర్యంలో అధ్యక్షుడు జేఎం నాయుడు, కార్యదర్శి జె.శ్రీనివాస్, కోశాధికారి జీవీ రమణ, సలహాదారుడు ఎంఎస్ మూర్తి, కమిటీ నిర్వాహకులు, సభ్యుల పర్యవేక్షణలో కార్యక్రమాలు జరిగాయి. వేదిక ప్రాంగణంలో ఏర్పాటుచేసిన భారీ స్క్రీన్‌పై అయోధ్య రామమందిర ప్రారంభోత్సవాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు.

బ్రాడ్‌వేలో... : బ్రాడ్‌వే ఆచారప్పన్ వీధిలోని అక్షయబాబా మందిరంలో రామజ్యోతి వెలిగించి సీతారామలక్ష్మణ హనుమంత స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జై వాసవీ సాయి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ అజంతా కనిగెలుపుల శంకరావు-విజయలక్ష్మి దంపతుల పర్యవేక్షణలో అయోధ్య రామాలయం ప్రారంభోత్సవం సందర్భంగా అక్షతలు, తీర్థ అన్నప్రసాదాల వినియోగం జరిగింది. కాగా, ముత్తయిదువలు 'జై శ్రీరామ్' పేరుతో నెయ్యి ప్రమిదలు వెలిగించి రామనామ పారాయణం చేశారు.


తిరువళ్లూర్ మారుతి టౌన్‌లో విశేష పూజలు





ప్రత్యేక పూజల్లో పాల్గొన్న శ్రీ ఆంధ్ర కళా స్రవంతి నిర్వాహకులు - టీటీడీ ఆలయంలో భక్తులకు ప్రసాద వితరణ - తిరువళ్లూర్ నగర్‌లోని ఆలయంలో ప్రత్యేక అలంకారంలో సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి

తిరువళ్లువర్ నగర్...

కొడుంగైయూర్ తిరువళ్లువర్ నగర్‌లోని సీతారాముల ఆలయంలో అయోధ్య రామాలయ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీసీతారామ కల్యాణ సేవా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వామివార్లకు నూతన పట్టువస్త్రాలు సమర్పించి బంగారు, వెండి నగలతో సుందరంగా అలంకరించారు. ఆలయ పూజారులు రామాలయంలోని బాలకాండలో సూచించిన విధంగా మహా హారతి పూజలు నిర్వహించారు. ఈ సదర్భంగా ప్రసాద వినియోగం జరిగింది.

మారుతి టౌన్...

తిరువళ్లూర్ సమీపంలోని న్యూ మారుతి టౌన్‌లో సెల్వగణపతి రామాలయంలో అయోధ్య శ్రీరామాలయ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరువూర్ భాస్కర్ బృందం సభ్యులు ప్రదర్శించిన పంద సేవ, రామనామ సంకీర్తనం భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. ఆలయ ప్రాంగణాన్ని అరటి, మామిడి తోరణాలు, విద్యుద్దీపాలతో, సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వామివార్లను పూలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

షావుకారుపేట...

షావుకారుపేట రెడ్డి రామన్ వీధిలోని రామకృష్ణ చైతన్య మందిరంలో మహా మంత్ర భజన మండలి ఆధ్వర్యంలో ఉదయం 6 నుంచి 8 గంటల వరకు రామ నామం జపిస్తూ నగర సంకీర్తనం నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు వీరబొమ్మల జనార్దనరావు, కార్యదర్శి కొత్త బాలనరసింహులు, సభ్యుడు పేరూరు మోహన్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మిర్చి వర్తక సంఘంలో....

జార్జిటౌన్ రామకృష్ణ వీధిలోని మద్రాసు చిల్లీస్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీరామచంద్రమూర్తికి వైభవంగా పూజలు నిర్వహించారు. వేదికపై కొలువుదీర్చిన సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామివార్లను పూలతో సుందరంగా అలంకరించారు. మధ్యాహ్నం 12.30 గంటలకు చిన్న తంబి, అన్నా పిళ్లై వీధి జంక్షన్‌లో భక్తులకు అన్నదానం చేశారు. అసోసియేషన్ నిర్వాహకులు మిరియాల మాధవయ్య, చింతు సురేష్‌కుమార్, సూరిశెట్టి భాస్కర్, సింగారపు శివకుమార్, సూరిశెట్టి సురేష్, శ్రీనివాసులు, ఇమాం బాషా, అరుణ్‌కుమార్, చంద్రశేఖర్, ధనుంజయ, దశయ్య, గిరిధర్, జనార్ధన్, కస్తూరయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వేళచ్చేరి: స్థానిక అభిరామిపురంలోని ఒక అపార్ట్‌మెంట్‌లో సభ్యులంతా ఒక చోట కలుసుకొని మధ్యాహ్నం 12 గంటలకు శ్రీరాముని చిత్రపటం ముందు దీపారాధనలు చేశారు. అనంతరం శ్రీరాముని పూలతో అర్చన చేసి, పాయసాన్ని నివేదన గావించారు. పిదప అందరూ కలసి ముక్తకంఠంతో రామ భజన చేశారు. భక్తిపాటలతో ప్రాంగణం ప్రతిధ్వనించింది. శ్రీ రాముని ప్రసాదంగా తీపి వంటకాలతో అన్నప్రసాదం అందరూ ఆరగించారు.

→ శ్రీరాముడి చిత్రపటానికి దీపారాధనలు చేస్తున్న దృశ్యం



ఐస్ వాటర్ స్పోర్ట్స్ అరెనా ప్రారంభం

అడయార్, జనవరి 22: స్థానిక రాయపేటలోని ఎక్స్‌ప్రెస్ అవెన్యూ మాల్‌లో ఓపెన్ ఎయిర్ టెర్రస్‌లో ఐస్ వాటర్ పేరుతో స్పోర్ట్స్ అరెనాను తాజాగా ప్రారంభించారు. మొత్తం 20 వేల చదరపుటడుగుల విస్తీర్ణంలో ఈ స్పోర్ట్స్ అరెనాను అంతర్జాతీయ సౌకర్యాలతో ఏర్పాటు చేశారు. ఎక్స్‌ప్రెస్ అవెన్యూ మాల్‌లోని సెంట్రల్ ఆర్టియంలో జరిగిన వేడుకలో సినీ నటుడు, నిర్మాత ఆర్య పాల్గొని కొన్ని రకాల క్రీడల్లో కూడా పాలుపంచుకున్నాడు. ఇదే విషయంపై ఎక్స్‌ప్రెస్ అవెన్యూ మేనేజింగ్ డైరెక్టర్ కవిత సింఘానియ మాట్లాడుతూ... ఐస్ వాటర్ స్పోర్ట్స్ అరెనా కేవలం స్పోర్ట్స్ ఫెసిలిటీ మాత్రమే కాదని.. ఇది ఎక్స్‌ప్రెస్ అవెన్యూ మాల్‌లో ఒక ప్రధాన కేంద్రంగా ఉంటుందని పేర్కొన్నారు.

ఏఎంఎం ఫౌండేషన్ శతవార్షికోత్సవం

అడయార్, జనవరి 22: మురుగప్ప గ్రూపునకు చెందిన ఏఎంఎం ఫౌండేషన్ విజయవంతంగా వందేళ్లను పూర్తి చేసుకుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పల్లావరంలోని ఏఎంఎం హాస్పిటల్‌లో విప్రో లిమిటెడ్ ఫౌండర్ ఛైర్మన్ అజీం ప్రేమ్‌జీ సెంటినరీ బ్లాక్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఎం ఫౌండేషన్ మాజీ మేనేజింగ్ ట్రస్టీ ఎంవీ సుబ్బయ్య, ఏఎంఎం ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ ఎంఏ అళగప్పన్, రాజ్యసభ సభ్యుడు పి.చిదంబరం తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా 'ఏఎంఎం ఫౌండేషన్: ఏ సెంటినరీ ఆఫ్ సర్వీస్' పేరుతో రూపొందించిన పుస్తకాన్ని ఎంఏ అళగప్పన్ ఆవిష్కరించగా, ఇతర అతిథులు ఆ పుస్తక ప్రతులను స్వీకరించారు.

